
కథ

# రాజయ్య మజిలీ

— జూకంటి జగన్నాథం



భూలోకం మినహా అన్ని లోకాల్లో అత్యవసర సైరన్లు మోగుతున్నాయి. ఉండీ ఉండీ స్వల్పంగా ప్రకంపనలు చెలరేగుతున్నాయి. యముడు చిత్రగుప్తునితో సంప్రదింపులు జరుపుతున్నాడు. ఇంద్రుడు ఎగువ సభను సమావేశపరచడానికి సమయం లేనందున పరిస్థితిపై ఆర్డినెన్స్ జారీ చేయడానికి సన్నద్ధమవుతున్నాడు. బ్రహ్మ అందరి ఫాలభాగములపై 'విధిరాత' రాసి రాసి చేతులు నొప్పెట్టగా ఒక ముఖముపైని చిరుచెమటను తుడుచుకొని మరో ముఖమును ఎత్తి గంభీరముగా అటువైపు దృక్కులను సారించి ఇంకో ముఖాన్ని సరస్వతితో ఏమి ఈ విపత్తు అన్నట్టు ప్రశ్నార్థకంగా పెట్టాడు. శివుడు గతంలో తన వరములచే బలాఢ్యుడైన భక్తుడు కన్నూమిన్నూ కానక కైలాసమును కదిలించుచున్నాడా లేక కఠోర తపస్సులో ఎవరైన నిమగ్నమయ్యారా అని గంగాపార్వతులతో విడివిడిగా చర్చిస్తున్నాడు. వినాయకుడు కుమారస్వాములు ఇటీవల దిగుమతి చేసుకున్న లియో టాయ్స్‌తో ముచ్చటపడుతూ గంగిరెద్దుల ఆట ఆడుకుంటున్నాడు. విష్ణువు కాళ్ళను వత్తుతూ లక్ష్మీదేవి చిన్నకుదుపునకు కారణమేమి అన్నట్లు చూసింది. విష్ణువు శౌనకాది మునులు ముక్కోటి దేవతలు కలిసి ప్రళయం గురించి ఏమైనా మహాజరు సమర్పించడానికి వస్తున్నారా అని క్షణమాలోచించి జయావిజయుల కంట్రోల్ రూమ్‌తో ఇంటర్‌కమ్‌లో మాట్లాడాడు. దేవతలందరు తమ తమ లోకాలలోని మాయాదర్పణంలో లైవ్ టెలికాస్టు కార్యక్రమములను తిలకించుచున్నారు.

మాయావి విష్ణువు సెల్యులార్ ఫోనులో అన్ని లోకాలను క ట్యాక్ చేసి సంతృప్తి నొందాడు. ఆ తదుపరి అసలీ చిన్న ప్రకంపనము వెనుకనున్న రహస్యాన్ని ఛేదించడానికి ఉద్యుక్తుడయ్యాడు. లక్ష్మీదేవి మళ్ళీ ఎడబాటుయా అన్నట్లు చిన్నబుచ్చుకుంది. బెంబేలు పడకు అలాటిదేమీ లేదు అన్నట్లు కింగ్‌మేకర్ విష్ణువు తలను అటీటూ ఊపి చిన్ననవ్వును చిందించి తన పనిలో నిమగ్నమయ్యాడు.

విష్ణువు 'అంజనము' వేశాడు. అంతే వైకుంఠమంతా పొగతో నిండిపోయింది. అనంతరం మెల్లమెల్లగా పరిసరాలు చకచకా లీలగా కదిలాడుతున్నాయి. సర్వాంతర్యామి తదేకంగా వీక్షిస్తున్నాడు. ఆఖరికి అంజనం వ్యూపాయింట్‌ను కనుగొన్న ప్రదేశం వద్ద ఆగిపోయింది. విష్ణువు నిశ్చేష్టుడయ్యాడు. దృశ్యం కలవరపెట్టింది. ఆశ్చర్యం నంచి తేరుకొని వెంటనే విష్ణువు కార్యోన్ముఖుడయ్యాడు. వైకుంఠంలో ఒక మూల భయంభయంగా గువ్వలా ఒదిగి రాజయ్య అటూ ఇటూ చూస్తూ ఉన్నాడు.

విష్ణువు వెంటనే రాజయ్య ఆటోబయోగ్రఫీ కోసం కోడ్‌ను ఇంటర్‌నెట్‌లో నొక్కాడు. విషయం వెంటనే అందుబాటులోకి వచ్చి అవగతం అయ్యింది. 'ఓయీ మానవుడా! యమలోకము, స్వర్గలోకము కైలాసములను వదిలి వైకుంఠమునకు సరాసరి వచ్చితివేల? ఏమి నీ వృత్తాంతము వివరింపుము?' అని హేళనగా ప్రశ్నించాడు.

మాటలు వినిపిస్తాయి కానీ మనిషి కనపడడు. 'ఇదేమి?' అనుకొని ఓహో బహుశా 'ఇది మన ఆకాశవాణి హైద్రాబాద్ రేడియోలా ఉందని అనుకొన్నాడు. మళ్ళీ అదే ప్రశ్న పదేపదే వినపడసాగింది. రాజయ్య అగమాగమై పోతున్నాడు. తనను తాను తమాయించుకొని, 'నీవెవ్వలో సారూ! కనిపియ్యక మాట్లాడుతున్నవు. గనీ నా కాళ్ళు చేతులు పెయ్యంత పచ్చిపుండోలె అయ్యింది. ఆకలి అయితుంది. దూపతోని నోట్లె నాలుక ఎండుకపోతుంది. కొన్ని నీళ్ళు మీ ఇంట్ల వుంటే ఇప్పియ్యిని. తాగినంక అన్ని చెపుతా' అన్నాడు.

చెంబు లేదు అందించే చెయ్యీలేదు - రాజయ్య ఆశ్చర్యంగా నోరెళ్లబెట్టేసరికి నీళ్ళు వచ్చి సరాసరి నోట్లో పడుతున్నాయి. తృప్తిగా తాగాడు. సరాయించుకున్నాడు. మొత్తం ఇల్లూ పొలం పెళ్ళాం పిల్లలూ నెలరోజులకు పెండ్లి కావాల్సిన పెద్దబిడ్డా, లద్దెపురుగుతో చీడపట్టిన పత్తిచేనూ, పాతబాకీతోపాటు ఎరువులు పురుగు మందుల కోసం చేసిన కొత్త బాకీ అంతా మిత్తీ అస్సలు కలిపి అయిన లక్ష పైన అప్పూ - అన్నీ జ్ఞాపకం వచ్చాయి రాజయ్యకు. జ్ఞాపకం రాగానే కడుపులకేల్లి దుఃఖం తన్నుకొచ్చింది. ఒకటే ఏడుపు మింటికీ మంటికీ ఏడుధారలుగా ఎక్కెక్కిపడి ఏడుస్తున్నాడు, పరిపరి విధాల తలపోసుకుంటూ గుండెను చెరువును చేసుకుంటున్నాడు.

సాక్షాత్తు విష్ణువు గుండె కరిగిపోయింది. పైకి కనబడకుండా గంభీరంగా కన్నీరు తుడిచాడు. దారితప్పి వచ్చిన మానవునికి ఏమి చెప్పినా అర్థం కాదనుకొని రాజయ్య మనస్సు ఎరిగి శంకు చక్రధారియైన విష్ణువు కుడిచేయి ఎత్తి అరచేయిని తెరచి 'తథాస్తు' అన్నాడు.

★ ★ ★

పొద్దు కరకర పొడిచింది. జనవరి తెల్లారిన చలి వణికిస్తుంది. ఆడోల్లు కొంగును తలచుట్టూ చుట్టుకొని చివర మునిపంటిన కరచుకొని నడుస్తున్నారు. మొగోల్లు చద్దర్లు కప్పుకొని బీడీ తాగే అలవాటున్న వాళ్ళు 'గప్పు గప్పు' పొగను ఊదుకుంటూ రేగట్ల భూమి పాటిమీది వైపు వెళుతున్నారు. ఆనోటా ఈనోటా సంగతి తెల్లారి నుంచి ఊరు ఊరంతా మెల్లమెల్లగా పాకిపోయింది. చీమలపుట్ట పగిలినట్టు జనమంతా కాలిబాట వెంట పత్తి చేనువైపు వరుసగా కదిలిపోతున్నారు.

'పాపం ఎంత పని చేసుకున్నడు. కొడుకుది మొదటి నుంచి రామసక్కని పుట్టుక - ఇజ్జతుకు పాటుపడ్డడు కొడుకు'

'అవ్వతోని కలిసి తల్లీ అయిదుగురు పిల్లలు ఎట్ల బతుకాలె?'

'పొద్దు పొడుపు కాడవున్న పోరగాండ్లు ఎన్నడు పెద్ద పెర్గాలె?'

'వీనియవ్వ మందులకు అగ్గితల్గ, ఒక్క పురుగు సావదాయె - రోజురోజూ చేనంతా లద్దెపురుగు పైలాయించి పోవుడేనాయె'

'గిన్ని అప్పులు చేసి గిన్నిసార్లు మందుకొట్టినా పంట ఎకరంల రెండు మూడు క్వింటల్లు ఎల్లితే - ఆ పత్తికి మార్కెట్ల ధర లేకపోయె - తక్కెట్లబాటు తీసిసేనట్టేనాయె'

మంది తలా ఒకమాట ఎవరికి తెలిసిన తీరుగా వాళ్ళు మాట్లాడుకుంటూ ముందుకు అడుగులేస్తున్నారు.

ఊరికి కిలోమీటరు దూరంగా రేగడి భూములు ఉన్నాయి. కొందరు మిర్చీపంట వేస్తే ఎక్కువమంది రైతులు ఈ యేడు మంచి ధర పలుకుతదని ప్రత్తిపంటను సాగుచేసారు. కరెంటు కోత, వర్షాలు సరిగ్గా కురవక బాయిలలో నీళ్ళు లేక వరిని తక్కువగా సాగుచేసారు. ఎక్కువమంది రైతులు పత్తిపంట మీదే పుట్టెడు ఆశలు పెట్టుకొని ఆశలు పెంచుకొని బతుకులను 'ఇగ రెండు నెలలైతే పంట చేతికి వస్తుంది మన అప్పులు కట్టాలు తీరుతాయని' అనుకుంటూ కళ్ళల్లో వత్తులు వేసుకొని పత్తిని కాపాడుకుంటున్నారు.

సిమెంటు గాజులబాయి నానుకొని వున్న పత్తిచేను నడుమ కండ్లు అలాగే ఆకాశంకేసి తేలేసి నోట్లె నుండి నురుగులు కక్కుకొని నిట్టనిలువునా పడి చడీచప్పుడు లేకుండా మనిషి శవంగా పడిపోయాడు. రాత్రి మంచుకి కొంచెం కొంచెం తడి అయిన మట్టి ధోతికి బనీనుకు అంటుకుంది. ప్రాణంపోగా నేలకేసి కాళ్ళు చేతులు కొట్టుకున్న జాడలు కనిపించాయి. కాళ్ళకు కాసింత దూరంగా చెప్పులు అస్తవ్యస్తంగా పడిపోయి ఉన్నాయి. కుడిచెయ్యికి రెండు గజాల దగ్గర అరలీటరు మోనోక్రోటోపాస్ క్రిమిసంహారక మందు ఖాళీడబ్బా చడీచప్పుడు లేకుండా నిశ్శబ్దంగా మౌన ప్రేక్షకునిలా ఉంది.

బాయిగడ్డ మీద పత్తిచేన్ల ఉసికేత్తారాలనంత జనం నిలబడి ఉన్నారు. మరికొందరు శవం చుట్టూ చేరి దగ్గరగా చూసి భార్యాపిల్లల యొక్క ముఖ్యంగా తల్లి యొక్క శోకానికి వచ్చిన అమ్మలక్కలే కాదు మగవాళ్ళు కూడా కంటనీరు పెడుతున్నారు. బాయిగడ్డ నానుకొని వున్న వేపచెట్టు కొమ్మమీద కూర్చొని కాళ్ళు కింద వేలాడేసి గదువకింద రెండు చేతులు ఆనించి మొత్తం దృశ్యాన్ని చూస్తున్నాడు. అందరూ పేరుపేరున కనిపిస్తున్నారు. కానీ తను ఎవ్వరికీ కనిపించడంలేదు.

'అయ్యా! మమ్ముల్నందరిని ఇడిసి నీకెట్ల సావబుద్ధైయింది. నేను నా పిల్లలం ఏమి పాపం చేసుకుంటిమి. మమ్ముల్ని దిక్కులేని పచ్చుల్ని చేసి నీవొక్కనివే పోతివి. అయ్యా! బర్లకాడిరాజడు అచ్చి పటేలేడని అడుగుతుండు. పొలం కాడికి పోయినవని చెప్పిల్నా లబ్బరుపైపులు 'అనుమకొండ'ల కొనుక్కొని పొద్దుమీకి ఊళ్ళె బస్సుకత్తడని చెప్పనా అయ్యో అయ్యా' మొగన్ని తల్చుకొని తన ముందు కుమిలి కుమిలిపోతున్న పిల్లలను చూసుకుంటూ రాజమ్మ గొంతెత్తి ఏడుస్తుంది.

వీళ్ళ అందరి ముఖం ఒక ఎత్తు అయితే తల్లి మల్లమ్మ దుఃఖం అందరి పెట్టు. ఆమెను ఓదార్చుడు ఎవరి వశం అయితలేదు.

'బాపూ! నా పెండ్లెవరు సేత్తరే బాపూ! నాకు పెండ్లి కాదని సత్తివా బాపూ! తమ్ముల్లూ, నేను బాపూ అని ఎవల్ని పిలువాలనే బాపూ... బాపూ మేమెట్ల బతుకాల్నె బాపూ... ఇగురంలేని పోరగాండ్లని తమ్ముల్నీ నన్నూ అందువు బాపూ... బాపూ...'

సంక్రాంతి పీడదినాలు గడిచిన తరువాత బిడ్డ పెండ్లి పత్రిక పెట్టుకునేది. కానీ అర్ధాంతరంగా చనిపోయిన తండ్రి శవం మీద పడి ఒక్కబిడ్డ వజ్రవ్వ ఒక్కతీరుగా దుఃఖిస్తుంది. మట్టిలో తలకాయను ఏసి కొట్టుకుంటుంది.

'నా అన్నా ఓ అన్నో నా అన్నా' కొంచెం దూరం నించి వర్ధన్నపేటకు ఇచ్చిన చెల్లె భూలక్ష్మి మతలబు తెలిసి బిగ్గరగా ఏడుస్తూ పరుగు పరుగున ఉరికి వస్తుంది.

ఏడ్చేవాళ్ళు దుఃఖాన్ని దిగమింగుకొని అటుదిక్కు చూస్తున్నారు. చుట్టూ మూగిన జనం 'బూలచ్మి అస్తుంది... తొవ్వ... తొవ్వ ఇయ్యిని' 'అరె కొంచెం పక్కకు... బందుకు నిలబడుని' తలోమాట అనుకుంటూ భూలక్ష్మికి దారి ఇచ్చారు.

వచ్చుడు వచ్చుడే భూలక్ష్మి వదిన మీద పడి ఏడుపు అందుకుంది.

తండ్రి చనిపోయిన తరువాత తన పెండ్లి చేసినప్పటి నుంచీ ఇప్పటిదాకా దపదాపలుగా చెప్పుకుంటూ కండ్ల నుంచీ నీళ్ళు పటపట వడుపుతుంది. కోడలును అల్లుళ్ళను దగ్గరకి తీసుకొని 'ఇగ ఎవ్వలున్నరని రావాలె బిడ్డా! ఇగ మీ మామ ఏమున్నంటే ఎవలకు చెప్పుకుంటనని చెప్పాలే బిడ్డా! ఇగ నాకు అన్న ఇల్లు తొవ్వ బందు అయ్యిందే అవ్వా! అన్న ఇల్లు చీకటి పడిందే అవ్వా!' అంటూ ఎగపోసుకుంటూ మనసు వల్లివల్లి ఏడుస్తుంది.

పిల్లలను ఇడిసిపెట్టి ఎగపీల్చుకుంటూ తల్లి మల్లవ్వను చిన్నపిల్లలను దగ్గర తీసుకు చుట్టుకున్నట్టు రెండు చేతులతో బాగా పట్టుకుంది. 'అవ్వా! నీ కొడుకు పోయిండా అవ్వా! నీ కొడుకు నీకేమి చెప్పిపోయిండే అవ్వా! నిన్ను ఎవలకు అప్పచెప్పి పోయిండే అవ్వా! అవ్వా పగోల్లకు గుడుక గిసుంటి సావు రావద్దే అవ్వా! అన్నా మనమేమి రాత అడుక్కచ్చుకుంటిమి అన్నా! ఆ దేవునిగుల్లె మన్నుపడ అన్నా! నిన్ను ఎందుకు గద్దోలె తన్నుకుపాయె అన్నా! అన్నా మనది బస్టు రాతనే అన్నా! అవ్వా! నాకెవలు వున్నరని ఇగ రావాల్నె అవ్వా! అన్నా నువ్వు నేను ఇంట్ల ఉన్నన్ని రోజులు నోట్లె 'సెల్లె'ను తీయకపోదువే అన్నా! నా అన్నా అన్నా ఓ అన్నా! అవ్వా! అన్నేమి సెప్పిండే' భూలక్ష్మి కడుపుల పేగులు నోట్లకు రాంగా తలుచుకు తలుచుకు పలువిధాలుగా రోదిస్తుంది.

ఆడోల్లు మొగోల్లు అందరూ గొల్లుమన్నారు - భూలక్ష్మి శోకానికి. కొందరు పెద్దమనుషులు 'బూలచ్చవ్వా! సైసు సైసు, జర ఉగ్గపట్టు... ఉగ్గపట్టు. పటేలుకేంది మారాజుగా పోయిండు, గా పోరగాండ్ల మొకం సూడు ఓ రాత్రి నుంచి ఏడ్సిఏడ్సి సోసలు అచ్చెటట్లున్నయ్' అంటున్నారు.

ఇంకా కొడుకు చచ్చిన పచ్చి నిజం షాకు నుంచి మల్లవ్వ తేరుకోలేదు. బెల్లంగొట్టిన రాతులెక్క కూచుంది. బిడ్డ భూలక్ష్మి శోకానికి అందరితోపాటు తనూ తన గతమంతా జ్ఞాపకం వచ్చి చలించిపోయి 'కొడుకా! నా కొడుకా! నాకు అగ్గిపెడుతవనుకుంటి కొడుకా! నన్ను అవతల పారేత్తవనుకొంటి కొడుకా! ఈ కట్టం మాకు రావొద్దు బిడ్డా! నా ఇంటి దీపాన్ని దొంగలెత్తుకు పోయిరనని చెప్పనా అవ్వా! బిడ్డా! రాత్రి అందరు తిని పన్నంక నా మంచం కాడికచ్చిండే కొడుకూ... అచ్చి అవ్వా! అవ్వా! పన్నవా అన్నడే కొడుకూ! ఏందిరా అన్నా బిడ్డా! అవ్వా తిన్నవా అని అడిగిండే అవ్వా! అవ్వా పత్తిపంట మంచిగలేదు సేటు పైసలకు పజీతు తీత్తుండే అని సెప్పిండే బిడ్డా! అజ్రవ్వ పెండ్లి ఎట్లనని రంజీల్లిండే అవ్వా! అన్ని అయితయి బిడ్డా! ఏం కాదు అన్ని సరిగా జరుగుతయని చెప్పిన్నే అవ్వా! మంచిది అవ్వా! అన్నడే కొడుకు అగోగట్ల అన్న కొడుకు బిడ్డా! గీ తీర్గ కనిపించిండే అవ్వా! నేనేమి సేత్తు కొడుకా గుడ్డి కొంగను కొడుకా సెర్ల తోలిపోతివా కొడుకా!' మల్లవ్వ గుండె పగిలింది.

'ఓ మల్లవ్వా! ఎన్ని సూత్తివీ ఎన్ని సేత్తివీ ఎన్ని కాలేదు ఎన్ని పోలేదు? అరె జర్రాగు. నువ్వే గిట్ల బేజీల్లుతే ఎట్ల' అని మనిషికో దిక్కు సముదాయించుతున్నారు.

వేపచెట్టు మీద కూకున్న అతని మనసు నీరునీరైపోతుంది. ఒక్కొక్క మాట తననూ పిండేసేసరికి ధారాపాతంగా ఏడుస్తున్నాడు. ఎవరికీ కనబడక పోవడమే కాదు తన ఏడ్పు వినపడడమూ లేదు.

జీప చప్పుడు అయ్యింది. పోలీసులు వస్తున్నారు. ఆ వెనుక రెండో జీపలోంచి దిగి ఎమ్మెల్యే మండలాధ్యక్షుడూ, సర్పంచ్, జడ్పిటీసీ, ఆ ప్రాంతంలోని ముఖ్య నాయకులూ, పత్రికా విలేకరులు వస్తున్నారు.

అందరూ తొవ్వ ఇచ్చారు. ఎండ చిరచిర కొడుతుంది. వేప చెట్టు కిందికి నడిచారు. ఏమేమో నాయకులూ, పోలీసులు మాట్లాడుకున్నారు.

(మిగతా 14వ పేజిలో..)

